# సాక్షి
# గుంటూరు

మంగళవారం, 13, మే, 2025






### ఘనంగా అంకమ్మతల్లి వార్షికోత్సవం

పెదకూరపాడు: 75త్యాళ్లూరులో వైశాఖ పౌర్ణమి సందర్భంగా అంకమ్మతల్లి వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పొంగళ్లు సమర్పించారు.



### భక్తిశ్రద్ధలతో చండీహోమం

దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



### వైభవంగా సీతారామ శాంతికల్యాణం

రేపల్లె: రేపల్లె ఒకటో వార్డు ఎస్టీ కాలనీలోని సీతారామ మందిర వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. శాంతి కల్యాణం కనుల పండువగా జరిగింది.

## న్యూస్‌రీల్

### సమస్యలను వారంలో పరిష్కరిస్తాం



కొల్లిపర(తెనాలి): తమకు అందిన ప్రతి సమస్యను వారంలో పరిష్కరిస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా కొల్లిపరలో మంత్రి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహతో కలిసి 200 వినతులు స్వీకరించారు. వీటిలో అత్యధికంగా బియ్యం కార్డుల దరఖాస్తులే ఉన్నాయి. అనంతరం మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా కోటి 46 లక్షల మందికి రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

### నేడు ఎంపీడీఓలతో సమీక్షా సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో), మండల పరిపాలనాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ పరిధిలో అమలు జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షిస్తామని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఎంపీడీవోలు, మండల పరిపాలనాధికారులు అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలతో హాజరు కావాలని సూచించారు.

### ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు



అమరావతి: బుద్ధ జయంతి వేడుకలను ధాన్యకటక బుద్ధవిహార ట్రస్టు చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక పాత మ్యూజియంలోని మహా చైత్యం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ వావిలాల మాట్లాడుతూ 2569 ఏళ్ల క్రితం గౌతమ బుద్ధుడు నడయాడిన అమరావతి నగరం దక్షిణ భారతదేశంలో బౌద్ధ ధర్మానికి కేంద్ర బిందువుగా కొనసాగిందన్నారు. సాక్షాత్తు గౌతమ బుద్ధుడు తన మొదటి కాలచక్ర క్రతువులు అమరావతి నుంచే ప్రారంభించారని బౌద్ధ సాహిత్యకారుల నమ్మకమన్నారు. అందుకే ఇక్కడ బుద్ధుని అస్థికలతో కూడిన మహా చైత్యం అనే గొప్ప కట్టడాన్ని నిర్మించారన్నారు. తొలుత మహాస్తూపం వద్ద ప్రత్యేక పూజాకార్యక్రమాలు, బౌద్ధమత ప్రార్థనలు నిర్వహించారు. నిమ్మా విజయసాగర్ బాబు, కోలా వెంకటేశ్వర రావు, యోగాశ్రమ నిర్వాహకులు కోనూరు అప్పారావు ప్రపుల్ల రాణి, గిరి స్వామి, పలువురు బౌద్ధ మతస్తులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పల్నాడు జిల్లా పరిధిలో 30 పరీక్ష కేంద్రాలలో మొదటి సంవత్సరం పరీక్షకు 93.34 శాతం, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 87.99 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలిరోజు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు సెట్–3 ప్రశ్నపత్రాన్ని లాటరీ ద్వారా ఎంపిక చేశారు. జూనియర్ ఇంటర్‌కు 3,132 మంది జనరల్ విద్యార్థులకుగాను 2,945మంది హాజరయ్యారు. 154 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 122మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు జనరల్ విద్యార్థులు 413 మంది నమోదు కాగా 364 మంది, ఒకేషనల్ విద్యార్థులు 70మందికి గాను 61 మంది హాజరయ్యారు. జిల్లా పరిధిలో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారి కె.సుచరిత తెలిపారు.

### ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా టీవీఎస్‌జీ కుమార్

నరసరావుపేట: పల్నాడు జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(కేఆర్ఆర్‌సీ–కోనేరు రంగారావు కమిటీ)గా టీవీఎస్‌జీ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈ పోస్టులో ఆర్.కుముదిని సింగ్ పనిచేశారు.

# ఆడిందే ఆట.. పాడిందే పాట

- రూ.6కోట్లతో పూర్తి చేసే అవకాశం ఉన్నా పీపీపీ పద్ధతికే జై
- వందల కోట్లు బడ్జెట్ ఉన్నా ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు తాపత్రయం
- చక్రం తిప్పిన కూటమి ప్రజాప్రతినిధి
- 1999లోనే ప్రారంభమైన ఆడిటోరియం పనులు...
- వివిధ కారణాలతో పూర్తి కాని వైనం
- రూ.70 కోట్ల విలువైన స్థలం 20 ఏళ్ల పాటు ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టే యత్నం
- ఇప్పటికే చిన్మయ, వెంకటేశ్వర బాలకుటీర్‌కు కార్పొరేషన్ స్థలాలు అప్పగింత

## ప్రైవేట్ వ్యక్తుల చేతికి నార్ల ఆడిటోరియం



బృందావన్ గార్డెన్స్‌లో నిర్మాణం ఆగిపోయిన నార్ల ఆడిటోరియం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: నగరం నడిబొడ్డున రూ.కోట్లు విలువ చేసే ప్రాంతంలో నగరపాలక సంస్థ ఎకరంపైగా స్థలంలో చేపట్టిన నార్ల ఆడిటోరియంను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. సుమారు రూ.6కోట్లు ఖర్చు చేస్తే నగరానికే తలమానికంగా తయారయ్యే ఈ ఆడిటోరియంను పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యం పేరుతో ప్రైవేటు సంస్థకు అప్పగించేందుకు కావాల్సిన తతంగాన్ని పూర్తి చేశారు. గత వారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో టేబుల్ అజెండాగా దీన్ని ముందుకు తీసుకువచ్చి ఎటువంటి చర్చ జరగకుండానే ఆమోదించేసి ప్రభుత్వానికి పంపించారు.

### 1.01 ఎకరాల్లో.. 600 మంది కూర్చునేలా..

వివరాల్లోకి వెళ్తే... 1997 సంవత్సరంలో గుంటూరు నగరపాలక సంస్థ నగరంలో సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు, పెద్ద సమావేశాల నిర్వహణ కోసం 1.01 ఎకరాల విస్తీర్ణంలో 600 మంది కూర్చునేలా ఆడిటోరియం నిర్మాణం కోసం ప్రతిపాదించారు. నగరంలో ముఖ్యమైన ప్రాంతమైన బృందావన్ గార్డెన్స్‌లోని కార్పొరేషన్ స్థలంలో 2001లో నిర్మాణాన్ని ప్రారంభించేందుకు గుంటూరు నగరపాలక సంస్థ రూ.70 లక్షల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. మాజీ మేయర్ కొల్లి శారద తన తండ్రి ప్రముఖ జర్నలిస్టు నార్ల వెంకటేశ్వరరావు పేరుతో ఆడిటోరియం నిర్మించేందుకుగానూ రూ. 20 లక్షలు అందించారు. టెండర్ల ద్వారా ల్యాంకో కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ కాంట్రాక్టర్ రూ.54.05 లక్షలతో పునాది వేసి, గోడలను నిర్మించారు. 2012 సంవత్సరంలో ఆడిటోరియం పెండింగ్ పనులను పూర్తి చేయడానికి బిల్డింగ్‌కు రూ.2కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసి ఆమోదం తెలిపారు. రూ.71.62 లక్షలతో ఆడిటోరియం గోడలు, ప్లాస్టింగ్ పనులు ఆడిటోరియం రూపు నిర్మాణ పనులను పూర్తి చేశారు. ఆడిటోరియంలోని ఎలక్ట్రికల్ పనులు, ఇంటీరియర్ పనులు, ప్లంబింగ్ పనులకు సంబంధించిన పనులను చేపట్టి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది. దీనికి రూ.8.75 కోట్లు అవుతుందని 2017లో అంచనా వేశారు. అయితే వివిధ కారణాలతో ఇది ఆచరణలోకి రాలేదు.

### హడావుడిగా ఆమోదం

సుమారు రూ.70 కోట్ల విలువైన ఈ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వెనుక స్థానిక ఉన్నత ప్రజాప్రతినిధితో పాటు అధికారులు కీలక పాత్ర వహించారు. ఒక ప్రైవేటు సంస్థ అడిగిందన్న పేరుతో మున్సిపల్ కమిషనర్ రిమార్కులు లేకుండానే ఒక ప్రతిపాదన కౌన్సిల్ ముందుకు చివరి నిముషంలో తెచ్చి కనీసం దాన్ని కౌన్సిల్‌లో చదవకుండానే ఆమోదం తెలపడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే నగరపాలక సంస్థకు చెందిన విలువైన స్థలాలను చిన్మయ విద్యాసంస్థలు, వెంకటేశ్వర బాలకుటీర్‌కు అప్పగించిన అధికారులు ఇప్పుడు మరో విలువైన స్థలాన్ని అన్యాక్రాంతం చేసేందుకు సిద్ధం అయ్యారు.

### ఎంపీ ఒత్తిడితోనే..!

తాజాగా బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్వహణ చూస్తున్న అన్నమయ్య సేవా సమితి వాళ్లు పీపీపీ పద్ధతిలో దీని పనులు పూర్తి చేస్తామని 2024 డిసెంబర్ 30న లేఖ రాశారు. దీనిని వెంటనే ఆమోదించాలని స్థానిక ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ కమిషనర్‌పై ఒత్తిడి తెచ్చారు. దీన్ని వెంటనే కౌన్సిల్‌లో పెట్టేందుకు ప్రయత్నం చేసినా అప్పటి నుంచి కౌన్సిల్ జరగకపోవడంతో ఆగిపోయింది. తాజాగా జరిగిన కౌన్సిల్‌లో రూ.6కోట్లు ఖర్చు అవుతుందని అందువల్ల నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియంను అన్నమయ్య సేవా సమితికి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి కోరుతూ కౌన్సిల్ తీర్మానం చేసేసింది. ఆడిటోరియం నుంచి వచ్చే ఆదాయాన్ని ఏ నిష్పత్తిలో పంచుకోవాలి, అదనంగా ఖర్చు పెట్టి వారి పేరు కూడా జత చేసేందుకు నిర్ణయం తీసుకోవాలని తీర్మానించారు. వందల కోట్ల రూపాయల బడ్జెట్ ఉన్న నగరపాలక సంస్థ రూ.6కోట్లు ఖర్చు పెట్టి గుంటూరుకే తలమానికంగా ఉండే ఆడిటోరియంను పూర్తి చేయకుండా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. దీనిపై కోర్టుల్లో సవాలు చేసేందుకు నగర వాసులు సన్నాహాలు చేస్తున్నారు.

## నేత్రపర్వం.. రథోత్సవం



అంగరంగ వైభవంగా స్వామివారి రథోత్సవం

- వైభవంగా సాక్షి భావన్నారాయణ స్వామి రథోత్సవం
- గోవింద నామస్మరణతో మార్మోగిన పొన్నూరు వీధులు

పొన్నూరు: గోవిందా.. గోవిందా నామస్మరణతో సోమవారం పొన్నూరు పట్టణం మార్మోగింది. పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణ స్వామివారి దివ్య రథోత్సవం స్వర్ణపురి వీధుల్లో అంగరంగ వైభవంగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తజనంతో పురవీధులు కిటకిటలాడాయి. స్వామి బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజుల నుంచి అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం రాత్రి 12 గంటలకు స్వామివారి కల్యాణం మహోత్సవం కనుల పండువగా జరిగింది. నిడుబ్రోలు వాస్తవ్యులు, పద్మశాలీ బహుత్తములు చింతక్రింది కిషోర్ కుమార్, వారి సోదరులు స్వామివారికి తలంబ్రాలు సమర్పించగా, అనువంశిక ధర్మకర్తలు శ్రీమంత్ రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్ బహుద్దూర్ మన్నే సుల్తాన్ దొర ఆధ్వర్యంలో స్వామికి తలంబ్రాలు పోశారు.

### పొన్నూరు భక్తజన సంద్రం

సోమవారం ఉదయం గరుడోత్సవం, మధ్యాహ్నం దేవస్థానంలో బ్రాహ్మణ సమారాధన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం హిందూ జనజాగృతి సమితి ఆధ్వర్యంలో పూలతో విశేషంగా అలంకరించిన రథంపై స్వామివారి దివ్య రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. డప్పు వాయిద్యాలు, స్వామి నామస్మరణతో వీధులన్నీ మార్మోగాయి. ఆలయ ప్రాంగణం నుంచి కసుకర్రు రోడ్డు వరకు రథోత్సవం సాగింది. వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందారు. స్వామి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించి భక్తులు ముగ్ధులయ్యారు. సుమారు మూడు గంటల పాటు రథోత్సవం సాగింది. భక్తులకు వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు మజ్జిగ, తాగునీరు అందించారు. చీమకుర్తి నాగభూషణరావు, పాములపాటి కృష్ణయ్య, పీ.టీ చౌదరి, కమలేంద్రనాథ్, కొండముది రామకృష్ణారావు, రాజకీయ నాయకులు, పలువురు ప్రముఖులు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. డీఎస్పీ జనార్దనరావు ఆధ్వర్యంలో పట్టణ సీఐ వీరానాయక్, ఎస్ఐ శ్రీహరితో పాటు పలువురు ఎస్ఐలు, ఏఎస్ఐలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈఓ, సిబ్బంది పర్యవేక్షించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

## తెలుగు సాహితీ సంబరాల్లో తెనాలి కవులు

### రంగిశెట్టి రమేష్‌కు కవిరత్న సాహితీ పురస్కారం

తెనాలి: ఏలూరులో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 10, 11 తేదీల్లో 48 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి జాతీయ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. తెనాలికి చెందిన కవి, రచయిత డాక్టర్ రంగిశెట్టి రమేష్‌కు కవిరత్న సాహితీ పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. ప్రముఖ సాహితీవేత్తలు, కళాకారుల సమక్షంలో సంస్థ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కార్యదర్శి ఈశ్వరి భూషణం, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఈ అవార్డును అందజేశారు. గత నాలుగు దశాబ్దాలుగా సాహితీ సేద్యం చేస్తూ, వచన కవితా ప్రక్రియలో ఇప్పటికీ రోజుకో సామాజిక అంశంతో కవితను రాస్తూ, సామాజిక చైతన్యంతో పాటు తెలుగుభాషా వికాసానికి రమేష్ కృషి చేస్తున్నారు.

### ఆళ్ల నాగేశ్వరరావుకు తెలుగు భాషా సేవా సాహితీ పురస్కారం...

ఇదే వేదికపై తెనాలికి చెందిన కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావుకు తెలుగుభాషా సేవా సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. వృత్తిపరంగా గుంటూరు–2 ఆర్టీసీ డిపోలో కండక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఆళ్ల నాగేశ్వరరావు, ప్రవృత్తిగా సాహితీ సేద్యం చేస్తున్నారు. వచన కవితా ప్రక్రియలో ఇప్పటికీ రోజుకో సామాజిక అంశంతో కవితను రాస్తున్నారు. సామాజిక చైతన్యం, తెలుగుభాషా వికాసానికి కృషి చేస్తున్నందున పురస్కారం అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు.



రంగిశెట్టి రమేష్‌కు పురస్కారం ప్రదానం



పురస్కారం స్వీకరించిన ఆళ్ల నాగేశ్వరరావు

### డాక్టర్ ప్రజ్ఞాచారికి తెలుగు భాషాసేవా పురస్కారం

తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీ రత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారికి తెలుగు భాషా సేవా జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేశారు. చైతన్యవంతమైన భావ జాలంతో రచనలు చేస్తూ, తెలుగు భాష అభ్యున్నతికి తనదైన శైలిలో కృషి చేస్తున్నందుకు, ఆయన సాహితీ సేవలను గుర్తించి జాతీయ తెలుగు భాషా సేవా పురస్కారాన్ని ప్రదానం చేశామని నిర్వాహకులు వెల్లడించారు.



పూర్ణ ప్రజ్ఞాచారికి పురస్కారం ప్రదానం

## పన్నెండు గంటల నిర్విరామ నృత్య ప్రదర్శన

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో విజయమాధవి సేవ సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు విజయమాధవికిశోర్ ఆధ్వర్యంలో జరగ్గా, 12 గంటలపాటు రత్నాచార్యులు, నృత్య కళాకారులు చేపట్టిన నృత్యాలు అలరించాయి. అనేక మంది కళాకారులు, వారి శిష్యుల అద్భుత నృత్య ప్రదర్శనలు చక్కటి హావ భావాలతో ప్రదర్శించారు. అనంతరం నాట్యాచార్యులను, కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సినీ నటులు రాగిణి, నాగమణి, టి.రజనీరెడ్డి, సీనియర్ గుండె వైద్యులు రామారావు, హైకోర్టు న్యాయమూర్తి కె.శ్రీనివాసమూర్తి ప్రసంగించారు.




నాట్యాచార్యులు, కళాకారులకు సత్కారం

# రోగులకు సన్ 'స్ట్రోక్'

### జీజీహెచ్‌లో పనిచేయని ఏసీలు

- పక్షవాతంతో ప్రాణాపాయ స్థితిలో రోగులు
- మొరాయిస్తున్న చికిత్సా పరికరాలు
- వైద్యులు, వైద్య సిబ్బందికి చెమటలు
- అధికారుల్లో కనిపించని స్పందన
- 'సాక్షి' చొరవతో సోమవారం రాత్రి ఏసీలు ఏర్పాటు
- కార్డియాలజీ విభాగంలో పనిచేయని ఏసీలపై స్పందించని అధికారులు




స్ట్రోక్ యూనిట్



స్ట్రోక్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ స్ట్రోక్ యూనిట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఓ గుర్తింపు ఉంది. ఏ ప్రభుత్వ ఆసుపత్రిలో లేని విధంగా గుంటూరు జీజీహెచ్‌లో (బ్రెయిన్ స్ట్రోక్) పక్షవాతం వచ్చిన వారికి తక్షణమే చికిత్స అందించి ప్రాణాలు కాపాడేందుకు డాక్టర్ ఎస్.వి.సుందరాచారీ దాతల సహాయంతో స్ట్రోక్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ప్రతినెలా వందల కొద్ది బాధితుల ప్రాణాలు కాపాడుతున్న స్ట్రోక్ యూనిట్‌లో నాలుగు రోజులుగా ఏసీలు పనిచేయడం లేదు. దీంతో రోగులకు చికిత్స అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది చమటోడుస్తున్నారు. కోమాలో ఉండి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న రోగులకు కొద్దిపాటి సాయం అందించేందుకు పక్కన ఉండే రోగుల సహాయకులు సైతం ఏసీలు పనిచేయక సొంతంగా ఇళ్ల వద్ద నుంచి ఫ్యాన్లు తెచ్చి పెట్టుకుంటున్న పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు ఉండటం లేదు.

### అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ....

స్ట్రోక్ యూనిట్‌లో ఏసీలు పనిచేయడం లేదని, తద్వారా చికిత్స పొందుతున్న స్ట్రోక్ బాధితులకు చికిత్స అందించేందుకు సైతం చాలా అవస్థలు పడాల్సి వస్తుందని వైద్యులు, వైద్య సిబ్బంది ఆసుపత్రి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చికిత్స కోసం రోగికి అమర్చే వైర్లు సైతం ఏసీలు పనిచేయక చమటలు కారిపోయి ఊడి పోతున్నాయి. దీంతో ఏ క్షణంలో రోగికి ఏమవుతుందోనన్న భయాందోళన వైద్యుల్లోనూ, వైద్య సిబ్బందిలోనూ, రోగి బంధువుల్లోనూ నెలకొని ఉంది. రాత్రి సమయాల్లో స్ట్రోక్ యూనిట్‌లో ఏసీలు పనిచేయక ఉక్కపోతకు ఊపిరాడక లోపల ఉండలేక, ప్రాణాపాయ స్థితిలో ఉన్న బంధువులను వదిలి బయటకు రాలేక నరక యాతన పడుతున్నారు. కాగా ఏసీలు పనిచేయక స్ట్రోక్ యూనిట్‌లో రోగులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' సూపరింటెండెంట్ కార్యాలయాన్ని వివరణ కోరగా వారు కాంట్రాక్టర్‌ను మూడు రోజుల క్రితం మార్చామని తెలిపారు. సోమవారం నూతన కాంట్రాక్టర్ ఏసీలు మరమ్మతులు చేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం రాత్రికి ఏసీలు పనిచేయడంతో స్ట్రోక్ యూనిట్‌లో రోగులు, వైద్య సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

### కార్డియాలజీలో పనిచేయక పోయినా స్పందించడం లేదు

రెండు నెలలుగా కార్డియాలజీ సీసీయూ విభాగంలో ఏసీలు పనిచేయడం లేదు. ఈ విషయాన్ని పలు మార్లు ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు, ఆసుపత్రి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ నేటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవడంతో చికిత్స పొందుతున్న విభాగంలో ఏసీలు పనిచేయక గుండెజబ్బు రోగులు, స్ట్రోక్ రోగులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అయినప్పటికీ ఆసుపత్రి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుండిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అత్యవసర వైద్య సేవల విభాగంలో కూడా (క్యాజువాల్టీ) ఏసీలు పనిచేయక అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రి అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆసుపత్రుల్లో ప్రతి వార్డులో ఏసీలకు తక్షణమే మరమ్మతులు చేయించి రోగుల ప్రాణాలు పోకుండా కాపాడాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

## అర్జీల పరిష్కారం వేగవంతం

### పీజీఆర్ఎస్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు



అర్జీలు స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

గుంటూరు వెస్ట్: వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీల పరిష్కారం మరింత వేగవంతం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గంగరాజు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో వివిధ శాఖల సమన్వయం బాగుండాలని తెలిపారు. ప్రజలు అందించే అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. 199 అర్జీలను గంగరాజు, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా అధికారులు పరిశీలించారు.

### బతుకు భారంగా మారింది ఆదుకోండి



నేను నా భార్య కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాం. మా అబ్బాయి రాజేష్‌కు చిన్నప్పటి నుంచి నూరు శాతం అవిటితనం ఉంది. మా బాబుకు రూ.15 వేలు పెన్షన్ వచ్చేట్లు చూడండి. ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉంది. ఒకరు బాబుతో 24 గంటలు ఉండాల్సిందే. ఇల్లు గడవడం కూడా కష్టంగా ఉంది. మమ్మల్ని ఆదుకోండి.

– కుమారునితో కె.రాము, సుజాత దంపతులు

### దర్గాను స్వాధీనం చేసుకోవాలి



స్థానిక హజరత్ కాలే మస్తాన్ వలి దర్గాను డైరెక్ట్ మేనేజ్‌మెంట్‌లోకి తీసుకోవాల్సింది గా వక్ఫ్‌బోర్డ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో దర్గాను స్వాధీనం చేసుకుని పవిత్రను కాపాడాలి. దర్గా ముతవల్లి కుమారుడు డ్రగ్స్ కేసులో చిక్కుకుని దర్గా పరువును, ప్రతిష్ఠను మంటగలిపారు. భక్తుల మనోభావాలను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని మనవి.

– షేక్ సుభాని, నాగూల్ మీరా, గుంటూరు

వాణిజ్యం

## నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **4,000** గరిష్ఠం : రూ. **6,200**

మోడల్ ధర రూ. **5,000**

## పసుపు ధరలు

**దుగ్గిరాల:** స్థానిక పసుపు యార్డుకు సోమవారం 993 బస్తాలు వచ్చాయి. మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 705 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,000, గరిష్ఠ ధర రూ.11,300, మోడల్ ధర రూ.10,450 పలికింది. కాయలు 288 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,101, గరిష్ఠ ధర రూ.11,300, మోడల్ ధర రూ.10,450 లభించింది. మొత్తం 744.750 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు కార్యదర్శి తెలిపారు.

## క్లుప్తంగా

### విద్యాశాఖ వెబ్‌సైట్‌లో టెన్త్ సప్లిమెంటరీ హాల్ టికెట్లు

**గుంటూరు ఎడ్యుకేషన్ :** ఈనెల 19 నుంచి జరగనున్న పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థుల హాల్ టిక్కెట్లను హెచ్‌ఎం లాగిన్‌తో పాటు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని డీఈవో సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులు దరఖాస్తు చేసిన పాఠశాలల హెచ్‌ఎంలు బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా తమ లాగిన్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా విద్యార్థులు 95523 00009 నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేయడం ద్వారా విద్యాసేవలను ఎంపిక చేసుకుని, తమ పేరు, పుట్టిన తేదీ, పాఠశాల పేరు, జిల్లా పేరు వివరాలతో హాల్ టిక్కెట్లు పొందవచ్చని తెలిపారు.

**ఈ నెల 20కి డీసెట్ గడువు పొడిగింపు**

డైట్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించనున్న డీసెట్–2025 దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈవో సీవీ రేణుక తెలిపారు.

# ప్రజల ఫిర్యాదులకు తక్షణం స్పందించాలి

- పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ ఆదేశం
- పీజీఆర్‌ఎస్‌లో బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ


వృద్ధుడి సమస్య అలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

**నగరంపాలెం:** జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదులు – పరిష్కారాల వ్యవస్థ (పీజీఆర్ఎస్) నిర్వహించారు. బాధితుల నుంచి అర్జీలను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్వీకరించారు. ఫిర్యాదిదారుల మొరను అలకించారు. జిల్లాలోని ఆయా సబ్ డివిజన్లలోని పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడారు. డీపీఓలో ఇచ్చిన ఫిర్యాదులపై స్పందించాలని సూచించారు. ఒకవేళ సమస్యలు పరిష్కారం కాకపోతే సంబంధిత బాధితులకు తెలియజేయాలని ఆదేశించారు. జిల్లా ఏఎస్పీలు జి.వి. రమణమూర్తి (పరిపాలన), ఎ.హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి (మహిళా పీఎస్), శివాజీరాజు (సీసీఎస్) కూడా ఫిర్యాదులు స్వీకరించారు.

### భార్య దౌర్జన్యం


దివ్యాంగుడైన మహేంద్ర

చిన్నతనంలోనే పోలియో సోకింది. నడిచేందుకు కష్టపడాలి. ఓ ప్రైవేటు ఆయిల్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నా. 2018లో ఓ మహిళను ప్రేమ పెళ్లి చేసుకున్నా. ఐదేళ్ల బాబు ఉన్నాడు. కొన్నాళ్లు కాపురం సజావుగా జరిగింది. 2023 నవంబర్‌లో కుమారుడ్ని తీసుకుని భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసిన ఆచూకీ తెలియలేదు. ఇటీవల ఆమె గుంటూరు జిల్లా తాడేపల్లి సీతానగరంలో ఉంటోందని తెలిసింది. దీంతో అక్కడికెళ్తే నాపై భార్యతో పాటు పలువురు దాడికి పాల్పడ్డారు. బంధువులతో చంపేందుకు కుట్ర ప్రయత్నాలు చేసింది. అయితే, వారి నుంచి తప్పించుకుని బయటపడ్డాను. భార్య, దాడికి పాల్పడిన వారిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశా. న్యాయం జరగలేదు. ఐదేళ్ల కుమారుడు జీవించి ఉన్నాడా.. లేదా తెలియడం లేదు. ఇంటి నుంచి వెళ్లినప్పుడు రూ.16 లక్షలు, లక్షలు ఖరీదు చేసే బంగారం, వెండి వస్తువులు, ఇంటి పత్రాలతో ఉడాయించింది. ప్రస్తుతం దివ్యాంగ ఫించన్ సైతం నిలిపివేశారు. బతికేందుకు కష్టంగా ఉంది. న్యాయం చేయగలరు.

– సీహెచ్.మహేంద్ర,
రామకృష్ణనగర్, వైఎస్‌ఆర్ కడప జిల్లా.

### ట్రాఫిక్ కానిస్టేబుల్ బెదిరింపులు

ఈ ఏడాది మార్చిలో ఆక్షన్ ద్వారా ఆర్.అగ్రహారంలోని 150 చదరపు గజాల స్థలాన్ని రూ.32.52 లక్షలకు కొనుగోలు చేశా. గత నెలలో గుంటూరు కార్యాలయంలో రిజిస్టర్ చేశారు. అయితే, గతంలో ఉన్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఫైనాన్స్ సంస్థ వద్ద అప్పు తీసుకుని డీఫాల్టర్ అయ్యారు. వారిద్దరి మధ్య లావాదేవీలు ముగిశాకనే ఆస్తిని కొనుగోలు చేశాం. ఇంటిని పునః నిర్మించాలనే ఉద్దేశంతో వెళితే కానిస్టేబుల్, అతని భార్య ఇబ్బందులకు గురిచేశారు. ఇంట్లో ఉండేందుకు వీల్లేదంటూ హుకుం జారీ చేశారు. తమపై తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తామని బెదిరిస్తున్నారు. కానిస్టేబుల్‌తోపాటు ఇంటికి ఎదురుగా ఉంటున్న ఓ ఇద్దరు కూడా వారికి మద్దతుగా ఉంటున్నారు. కానిస్టేబుల్‌ను పిలిచి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నా. వారి నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని వేడుకుంటున్నా.

– ఓ మహిళ, చర్లగుడిపాడు గ్రామం,
గురజాల మండలం, పల్నాడు జిల్లా

# ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతులు

జోన్–3లో 11 మంది అధ్యాపకులకు ప్రయోజనం

**గుంటూరు ఎడ్యుకేషన్ :** గుంటూరు జోన్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న 11 మంది అధ్యాపకులకు ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఇంటర్మీడియెట్ విద్యా మండలి డైరెక్టర్ డాక్టర్ కె.కృతికా శుక్లా సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన అధ్యాపకులకు తాత్కాలిక ప్రాతిపదికన ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ విడుదల చేసిన ఉత్తర్వుల్లో భాగంగా జోన్–3 పరిధిలోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో 11 మంది ప్రిన్సిపాళ్లుగా ఉద్యోగోన్నతి పొందారు.

- సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఎం. శ్రీనివాసరావు పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, గుంటూరులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు బీఎస్ సురేష్ అచ్చంపేటకు, సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ అధ్యాపకురాలు యు. కోటేశ్వరమ్మ అద్దంకి జీజేసీ, నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఎం. రమణారెడ్డి నెల్లూరులోని డీకే జీజేసీ, నెల్లూరులోని కేఏసీ జీజేసీ అధ్యాపకురాలు జయమాలతి టంగుటూరు జీజేసీ, నెల్లూరు డీకే జూనియర్ కళాశాల అధ్యాపకురాలు బి. కృష్ణవేణి రాపూరు జీజేసీ, దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కలవకొల్లు వాసు పొదిలి జీజేసీ, సత్తెనపల్లి జీజేసీ అధ్యాపకుడు వి.శ్రీనివాసరావు ఉదయగిరి జీజేసీ, పీవీ పాలెం జీజేసీ అధ్యాపకురాలు కె. లక్ష్మీ జ్ఞానేశ్వరి చేజర్ల జీజేసీ, వెంకటాచలం జీజేసీ అధ్యాపకురాలు జి. కరుణకుమారి వెంగమాంబపురం జీజేసీ, టంగుటూరు జీజేసీ అధ్యాపకుడు పి. సద్గుణరావు కొమరోలు జీజేసీకి ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతి పొందారు. సంబంధిత అధ్యాపకులందరూ వారం రోజుల్లోగా కళాశాలల్లో ప్రిన్సిపాల్స్‌గా చేరాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

### నేడు కంతేరులో బాధితులకు పరామర్శ

**తాడికొండ:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు.. మంగళవారం కంతేరులో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ వలపర్ల కల్పనతో పాటు పలువురు పార్టీ నాయకులపై కూటమి నేతలు అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపించిన నేపథ్యంలో ఆయా కుటుంబాలను వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి తదితరులు పరామర్శించి ధైర్యం చెప్పనున్నారు. తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో గుంటూరు పార్లమెంటు పరిధిలోని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొననున్నారు.

# ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడతారా ?

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు
- రైతులు, మహిళలు అనే తేడా లేకుండా కేసులు నమోదు
- తప్పుడు కేసులు పెట్టిన ప్రతి ఒక్కరూ సమాధానం చెప్పాలి



మాట్లాడుతున్న కనకారావు

**తాడేపల్లి రూరల్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతిపక్షాలు, సామాన్య ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేసేందుకు తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపిస్తున్నారని రాష్ట్ర వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు ధ్వజమెత్తారు. ఇప్పటికీ ఎంతో మంది రైతులు, మహిళలు జైళ్లలో మగ్గుతున్నారని, నియంతృత్వ ప్రభుత్వాలు ఎంతోకాలం నిలబడవని తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని క్రిస్టియన్‌పేటలో అంబేడ్కర్ విగ్రహానికి మెమోరాండం అందజేసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహించి, పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమ్మూరు కనకారావు మాట్లాడుతూ రాజధాని ప్రాంతమైన తుళ్లూరు మండలంలో దళిత ఎంపీటీసీ సభ్యురాలు వలపర్ల కల్పనతో పాటు మరి కొంతమంది మహిళలపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా అర్ధరాత్రి మహిళా కానిస్టేబుళ్లను పక్కన పెట్టి, సీఐ వాసు కల్పనను కనీసం దుస్తులు కూడా మార్చుకోనీయకుండా, అసభ్యంగా మాట్లాడుతూ ఇంట్లోంచి తీసుకొచ్చినట్లు తెలిపారు. రాజ్యాంగం ప్రకారం మహిళలను ఉదయం 6 గంటల తరువాత అదుపులోకి తీసుకోవాలని, అది కూడా మహిళా ఇన్‌స్పెక్టర్ ఉండాలన్నారు. ఎవరూ లేకుండా కూటమి నాయకుల మెప్పు కోసం సీఐ వాసు ఇలా ప్రవర్తించారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి విడదల రజనీని కూడా ఎటువంటి నిర్ధారణ లేని కేసులు పెట్టి, ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పర్చాలని ప్రశ్నించిన రైతులు, మహిళలపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలా పంపించుకుంటూ పోతే జైళ్లన్నీ నిండిపోతాయని చెప్పారు. త్వరలోనే అఖిల పక్షం ఆధ్వర్యంలో 'జైల్ భరావో' కార్యక్రమం నిర్వహిస్తామని, తామంతా జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నియోజకవర్గంలో దళితులను అగ్రవర్ణాలు బహిష్కరణకు గురిచేసినా కనీసం ఉప ముఖ్యమంత్రి నోరు మెదపలేదని విమర్శించారు.రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై అనేకచోట్ల ఇలాంటి దాడులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

**తప్పుడు కేసులు పెట్టిన వారిని వదిలిపెట్టేది లేదు**

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్సీ సెల్ నాయకులు ఈదులమూడి డేవిడ్‌రాజు మాట్లాడుతూ ఒకవైపు పోరాటం నిర్వహిస్తూ మరోవైపు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సలహా మేరకు లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో తప్పుడు కేసులు పెట్టిన వారిని వదిలిపెట్టేది లేదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షులు ఈపూరి ఆదాం, తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుకోటి శ్రీనివాస మధు, గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడ వెంకటేశ్వరరావు (పండు), బాలసాని అనిల్, బత్తుల దాసు, పెరికే బాబు, అమృతరావు, కాంద్రు నాగరాజు, ఇసుకపల్లి అనిల్, బేతం భాస్కర్, చిన్నం అనిల్, బుర్ర శ్రావణ్, గంజి షణ్ముఖ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య


హేమలత మృతదేహం

**గుంటూరు రూరల్:** భర్త వేధింపులు భరించలేక వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. హైదరాబాదులో ఆత్మహత్య చేసుకున్న ఆమె మృతదేహాన్ని పలు నాటకీయ పరిణామాల మధ్య అంబులెన్స్‌లో గుంటూరు శివారు ఓబులనాయుడుపాలేనికి తరలించడంపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాధితులు, నల్లపాడు పోలీసుల కథనం ప్రకారం... ప్రత్తిపాడు మండల యనమదల గ్రామానికి చెందిన హేమలతకు 2020లో ఓబులనాయుడుపాలెం గ్రామానికి చెందిన మురళీతో కులాంతర వివాహం జరిగింది. హేమలత హైదరాబాదులోని ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. పెళ్లి అనంతరం కాపురాన్ని హైదరాబాద్ లింగంపల్లి ప్రాంతానికి మార్చారు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. భర్త మురళి జులాయిగా తిరుగుతూ, బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. డబ్బులు కోసం నిత్యం భార్యను వేధింపులకు గురి చేస్తూ ఉండేవాడు. చేసేదిలేక హేమలత తన శక్తికి మించి రుణాలు చేసి అడిగిన మొత్తం సర్దుబాటు చేసేది. ఇటీవల భర్త వేధింపులు ఎక్కువయ్యాయి. ఆదివారం భార్యాభర్తల మధ్య ఏం జరిగిందో తెలియదు. హేమలత అనుమానాస్పద స్థితిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు చెప్పకుండా భర్త ఆమె మృతదేహాన్ని నేరుగా అంబులెన్స్‌లో ఓబులనాయుడుపాలేనికి తీసుకు వచ్చాడు. విషయం తెలుసుకున్న హేమలత కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. మృతురాలి తండ్రి కోటేశ్వరరావు నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వంశీధర్ ఆదేశాల మేరకు ఎస్.ఐ నారాయణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జీరో ఎఫ్ఐఆర్ చేసి కేసును హైదరాబాద్ చందానగర్ స్టేషన్‌కు బదిలీ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 6,037 మంది హాజరు

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు తొలిరోజు సోమవారం జిల్లా వ్యాప్తంగా 6,037 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 51 కేంద్రాల్లో జరిగిన ప్రథమ సంవత్సర పరీక్షలకు దరఖాస్తు చేసిన 5,938 మంది విద్యార్థుల్లో 5,639 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 10 కేంద్రాల్లో జరిగిన ద్వితీయ సంవత్సర పరీక్షలకు దరఖాస్తు చేసిన 452 మంది విద్యార్థుల్లో 398 మంది హాజరయ్యారు.ఆర్ఐవో జీకే జుబేర్‌తో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్స్, డీఈసీ సభ్యులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

# రోగుల సేవలో నర్సులది కీలకపాత్ర

- ఘనంగా అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం
- వాక్‌థాన్‌లో భారీగా పాల్గొన్న నర్సింగ్ విద్యార్థినులు


వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న ఎయిమ్స్ డెరెక్టర్ డాక్టర్ అహెంతమ్ శాంత దాస్


సీపీఆర్ డెమో నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

**మంగళగిరి:** రోగులకు వైద్య సేవలందించడంలో నర్సుల పాత్ర కీలకమని ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్) డైరెక్టర్ డాక్టర్ అహెంతమ్ శాంత దాస్ తెలిపారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎయిమ్స్ ఆధ్వర్యంలో నర్సులు వాక్‌థాన్ నిర్వహించారు. ఎయిమ్స్ వెస్ట్ గేటు వద్ద డైరెక్టర్ డాక్టర్ అహెంతమ్ శాంత దాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఎయిమ్స్ నుంచి వాక్‌థాన్‌గా మంగళగిరి పట్టణంలోని బస్టాండ్ సెంటర్ చేరుకుని, అంబేడ్కర్ విగ్రహ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సులు ప్రజలకు అత్యవసర పరిస్థితిలో అందించాల్సిన వైద్య సేవలు, కార్డియాక్ అరెస్ట్ అయినప్పుడు సీపీఆర్ డెమో చేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ రోగులకు వైద్యం అందించే సమయంలో డాక్టర్లతో పాటు నర్సుల పాత్ర ఎంతో విలువైనదని కొనియాడారు. రోగికి సపర్యలు చేస్తూ వ్యాధి నయమయ్యేందుకు నర్సులు కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ధర్నాను విజయవంతం చేయాలి

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బసవ లింగారావు


మాట్లాడుతున్న బసవ లింగారావు

**గుంటూరు ఎడ్యుకేషన్:** విద్యారంగంతో పాటు ఉపాధ్యాయ బదిలీల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘ పిలుపు మేరకు మూడవ దశ పోరాటంలో భాగంగా ఈనెల 14న విజయవాడలో తలపెట్టిన ఉపాధ్యాయుల రాష్ట్ర స్థాయి ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ ఉమ్మడి గుంటూరు జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కన్నావారితోటలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడారు. 117 జీవో రద్దుతో పాటు, పాఠశాల విద్యారంగంలో పూర్వ విధానాన్ని కొనసాగిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయకుండా, తొమ్మిది రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడం సరైనది కాదని విమర్శించారు. దీనిపై ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినప్పటికీ పట్టించుకోలేదని తెలిపారు. బదిలీల్లో అన్ని కేడర్ల వారీగా ఖాళీలు చూపుతామని చెప్పి, ప్రస్తుతం ప్రతి మండలంలో కొన్ని ఖాళీల చొప్పున బ్లాక్ చేసేందుకు నిర్ణయించడం తగదని పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు సయ్యద్ చాంద్ బాషా, మక్కెన శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి 1:20, ఉన్నత పాఠశాలలో 45 మందికి రెండవ సెక్షన్, ప్రాథమికోన్నత పాఠశాలకు కనీసం ఆరుగురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను ఇవ్వాలని కోరినప్పటికీ ఫలితం లేదని తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలల్లో సైతం గందరగోళ పరిస్థితులను తెచ్చారని విమర్శించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఉదాసీనత విడనాడనాడకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ మూడు జిల్లా శాఖల ప్రధాన బాధ్యులు మహమ్మద్ ఖాలీద్, ఉస్మాన్, విజయబాబు, సీనియర్ నాయకులు జి.దాస్, ఎస్ఎస్ఎన్ మూర్తి, చక్కా వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ చెట్టిపోగు లక్ష్మణ్ కుమార్, మాలకొండయ్య, పి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీ నృసింహస్వామి జయంత్యుత్సవం


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు

**మంగళగిరి:** శ్రీ నారసింహ చతుర్దశిని పురస్కరించుకుని సోమవారం శ్రీ లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ నారసింహస్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి శ్రీదేవి భూదేవి సమేతుడై గ్రామోత్సవంలో దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కొబ్బరికాయలు కొట్టి ప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారి జయంత్యుత్సవం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు.

# రోగికి కేసు షీట్ ఇవ్వాల్సిందే..!


జాతీయ వినియోగదారుల సమాఖ్య ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు, పక్కన డాక్టర్ చదలవాడ హరిబాబు తదితరులు

**గుంటూరు మెడికల్:** రోగికి కేసు షీటు ఇవ్వాల్సిందేనని జాతీయ వినియోగదారుల సమాఖ్య ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు అన్నారు. గుంటూరులోని గర్తపురి కన్జూమర్స్ కౌన్సిల్ ఆఫీసులో సోమవారం వైద్య వివరాలు, హాస్పిటల్స్ విధులపై సమావేశం నిర్వహించారు. సమావేశానికి చేకూరి రాజశేఖర్ అధ్యక్షత వహించారు. డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రెగ్యులేషన్ ప్రకారం రోగ నిర్ధారణ, పరిశోధన వివరాలు రోగికి తప్పనిసరిగా వైద్యాధికారులు తెలియజేయాలని తెలిపారు. రోగి మరణిస్తే అన్ని కారణాలు ఆ కేసులో తెలపాలని చెప్పారు. వైద్యులు ఏ మందులు ఎప్పుడు వాడారు..నర్సింగ్ సిబ్బందికి చెప్పిన సూచనలు కేసులో తేదీల వారీగా ఉండాలని, చికిత్స వివరాలు సమగ్రంగా ఉండాలని తెలిపారు. రోగిగానీ, అతని బంధువులు గానీ మెడికల్ రికార్డులు కావాలని అడిగిన తరువాత 72 గంటల్లో అందించాలని సూచించారు. రాజశేఖర్ మాట్లాడుతూ రోగికి రికార్డు ఇవ్వకుండా మెడికల్ ప్రాక్టీషనర్‌కు ఏ మినహాయింపు, ఏ చట్టం ఇవ్వలేదని తెలిపారు. మొత్తం చికిత్స వివరాల ఫొటో కాపీలు హాస్పిటల్ వారు ఇవ్వాలని సూచించారు. జిల్లా విజిలెన్స్ సభ్యుడు బీరాల నాగేశ్వరరావు మాట్లాడుతూ హాస్పిటల్ వారు రోగికి వైద్య వివరాలను నిరాకరించడమంటే తన బాధ్యత నిర్వహణలో నిర్లక్ష్యమవుతుందని తెలిపారు. న్యాయస్థానాలు కోరినప్పుడు తప్పనిసరిగా సంబంధిత రోగి రికార్డులు సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. బేబీ సరోజిని మాట్లాడుతూ వైద్యులు తప్పు చేసి ఉంటే అందువల్ల నష్టపోయిన రోగులు, కేసు షీటును సాక్ష్యాధారంగా కోర్టులో ఉపయోగించవచ్చని తెలిపారు. మునిపల్లె కవిత మాట్లాడుతూ రోగులకు చికిత్స చేసిన వివరాలను అందించడంలో పూర్తి పారదర్శకత ఉండాలని సూచించారు. కేసు సీట్ బాధ్యత వైద్యులు, హాస్పిటల్ పైన ఉందని చాలా కేసుల్లో కోర్టులు తీర్పులు ఇచ్చాయని ఆయన పేర్కొన్నారు.

# త్రయాహ్నిక మహోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక పూజల నిర్వహణ

**నగరంపాలెం:** అరండల్‌పేటలోని శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠపాలిత శ్రీ గంగా మీనాక్షి సోమసుందరేశ్వరస్వామి దేవాలయం (శివాలయం)లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, అయ్యప్పస్వామి వార్లకు గోపుర నిర్మాణం, శిఖర ప్రతిష్ట త్రయాహ్నిక మహోత్సవాన్ని సోమవారం ప్రారంభించారు. యాగ బ్రహ్మ గుంటూరు కాశీ విశ్వనాథశర్మ మాట్లాడుతూ గోవు, గణపతి పూజలు, దీక్ష ధారణ, వాస్తు హోమం చేశామని తెలిపారు. ఈనెల 13న మూలమంత్ర జపాలు, హోమం, ఆదివాసాలు, బలిహరణ, ఊరేగింపు, 14న మూలమంత్ర హోమాలు, శ్రీ విద్యారణ్య భారతి స్వామి స్వహస్తాలతో యంత్ర, శిఖర ప్రతిష్ట, కలశ స్థాపన, ప్రాణ ప్రతిష్ట, పూర్ణాహుతి, శాంతి కల్యాణం, ప్రసాద వితరణ ఉంటాయని తెలిపారు. ఈ మూడు రోజులు కార్యక్రమాలను అయ్యప్ప సేవా సమాఖ్య ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ధర్మకర్త ఏకా ప్రసాద్, ఆలయ అర్చకులు కుందుర్తి సుబ్రహ్మణ్యశర్మ, కుందుర్తి భాస్కర్‌శర్మ, ఆలయ గోపుర నిర్మాణ, శిఖరాల దాత సిరిపురపు శ్రీధర్‌శర్మ, దారపనేని శివప్రసాద్, మర్రిపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

### జూన్ 6న వేద పాఠశాల పునఃప్రారంభం

**నగరంపాలెం (గుంటూరు వెస్ట్) :** స్థానిక మారుతీనగర్‌లోని శ్రీకంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్ష ధర్మ సమితి వేద స్మార్త సంస్కృత శాస్త్ర పాఠశాల ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి వచ్చే నెల ఆరో తేదీ నుంచి పునఃప్రారంభమవుతున్నట్లు దేవాలయ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో వేదం, స్మార్తం అభ్యసించాలనుకునే విద్యార్థులు ఎనిమిదేళ్ల నుంచి 13 ఏళ్ల లోపు వయసు, ఉప నయనం అయిన వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 98488 72729 నంబర్‌లో, లేదా మారుతీనగర్‌లోని దేవాలయ ప్రాంగణంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.